క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా మంగళవారం సరూర్‌నగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డివిజినల్ ఇంజనీర్ కే.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ హుడాకాంప్లెక్స్, శారదానగర్, డెంటల్ కాలేజ్, పుష్పాగార్డెన్, కమలానగర్, నేతాజీనగర్, నర్సింహపురికాలనీ, సరూర్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని డీఈ కోరారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పాదయాత్ర వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టనున్న ప్రజా సంఘర్షణ పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఎన్ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తల్లోజు వినోద్‌చారి ఆధ్వర్యంలో సోమవారం కందుకూరులో ఆవిష్కరించారు. వన దేవతలు సమ్మక్క, సారలమ్మల ఆశీర్వాదంతో రేవంత్‌రెడ్డి చేపడుతున్న పాదయాత్రను జయప్రదం చేసేలా పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు చింతకింద రంజిత్, అక్కిరెడ్డి దీక్షిత్, పవన్, కౌశిక్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యతిరేక విధానాలను ఎండగడతాం

ఏబీవీపీ నగర కార్యదర్శి సాయికిరణ్


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏబీవీపీ నాయకులు

కందుకూరు: ఏబీవీపీ వీరపట్నం జిల్లా సమ్మేళనాన్ని బుధవారం శాస్త్ర గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి అనేగొని సాయికిరణ్ తెలిపారు. మండల పరిధిలోని నేదునూరు మోడల్ స్కూల్‌లో సమ్మేళనానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను ఏబీవీపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు. విద్యార్థులు సమ్మేళనానికి పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర సంయుక్త కార్యదర్శి అమరేందర్, గొని విజేందర్, విద్యార్థులు ఈశ్వర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్మసేవా అవార్డు అందుకున్న గిరి


అవార్డు అందుకుంటున్న గిరి

బడంగ్‌పేట్: మతిస్థిమితం లేని అనాథ, మానసిక దివ్యాంగులకు అందిస్తున్న సేవలను గుర్తించి మాతృదేవోభవ అనాథ మానసిక దివ్యాంగుల ఆశ్రమ నిర్వాహకులు.. గట్టు గిరికి పద్మ సేవా అవార్డును అందజేశారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి అనాథ, మానసిక దివ్యాంగులకు గత ఐదేళ్లుగా గట్టు గిరి సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా గిరి మాట్లాడుతూ.. పద్మసేవా అవార్డుతో అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవార్డుతో కలిసి ఇప్పటివరకు తనకు 153 అవార్డులు వచ్చినట్లు గిరి తెలిపారు. ఇంద్రోజు రమేష్.. ఆశ్రమాన్ని వెతుక్కుంటూ వచ్చి అవార్డును అందజేయడం ఆనందంగా ఉందననారు. అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సీసీ రోడ్ల నిర్మాణాన్ని సత్వరం పూర్తిచేయాలి

దిల్‌సుఖ్‌నగర్: ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయా కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం మార్గదర్శి కాలనీలో పర్యటించి కంకర తేలి గుంతలుగా మారిన రోడ్లను ఆమె పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ... కాలనీలో రోడ్లు కంకర తేలి గుంతలుగా ఏర్పడటంతో నీరు చేరి రోడ్లు మొత్తం అధ్వానంగా తయారయ్యాయని పేర్కొన్నారు. మార్గదర్శి కాలనీలో సీసీ రోడ్డు కోసం మేరకు జీహెచ్‌ఎంసీ నిధుల నుంచి రూ. 76 లక్షల మంజూరైందన్నా. బీజేపీ సీనియర్ నాయకులు ధీరజ్‌రెడ్డి, బీజేపీ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు రాములు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సభ సజావుగా సాగేనా..?

- తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశాలు
- కొరవడిన జవాబుదారీతనం
- డుమ్మా కొడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు
- నేడే మండల సర్వసభ్య సమావేశం
- సభ్యుల హాజరుపై సందేహాలు



మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న మంత్రి, ప్రజాప్రతినిధులు, అధికారులు(ఫైల్)

మహేశ్వరం: ప్రజా సంక్షేమ పథకాల అమలు, సాధించిన ప్రగతి, చేపట్టాల్సిన పనులు, గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, వాటికి పరిష్కార మార్గాలు తదితర అంశాలపై మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాల్లో జవాబుదారీతనం కొరవడుతోంది. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ చూపకుండా మండల సర్వసభ్య సమావేశాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో హాజరుకావాల్సి ఉండగా, ప్రధాన శాఖల అధికారులు కొందరే హాజరై, మరి కొందరు గైర్హాజరవడంతో పాటు పలువురు అధికారులు కింది స్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపించి మమా అనిపిస్తున్నారు.

తూతూ మంత్రంగా..

మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాకున్నా అడిగే వారు లేకపోవడంతో, వచ్చినా మొక్కుబడిగా సభ జరగడంతో కొందరు సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అధికారుల పనితీరు మొదలగు అంశాలపై చర్చించడానికి ప్రతి మూడు నెలలకు ఒక్కసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం ప్రతిసారీ మొక్కుబడిగా సాగుతోంది. గత మూడు నెలల క్రితం ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. అయితే గతంలో 31 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన పలు అంశాలు, సమస్యలపై మండల సభలో పరిష్కారం చూపడం లేదని ప్రజలు విమర్శలు చేస్తున్నారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలు, జరగాల్సిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు వంటి అంశాలపై ప్రతి మూడు నెలలకోసారి ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి. కానీ వారు గైర్హాజరవుతున్నారు. కొంత మంది సభ్యులు సభకు హాజరైన ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నోరు మెదపడం లేదు. మరి కొందరైతే మాట్లాడిందే పదేపదే మాట్లాడి ఇతర సభ్యులకు మాట్లడే అవకాశం లేకుండా చేస్తున్నారు. మరి కొంత మంది సభ్యులు మళ్లీ మళ్లీ మాట్లాడి ఇతర సభ్యులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. కొంత మంది మహిళా సర్పంచులు, ఎంపీటీసీలు సమావేశానికి హాజరైనా సమస్యలపై చర్చించకుండా మౌనంగా ఉండిపోతున్నారు.

పరిష్కారం కాని సమస్యలు

గత సమావేశంలో పలు సమస్యలు చర్చకు వచ్చాయి. పల్లె ప్రగతి కింద గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు నిధులు విడుదల కాకపోవడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు రావాల్సిన పెండింగ్ నిధులు విడుదల చేయాలని గత సమావేశంలో సభ్యులు కోరారు. పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ సారి కూడా అవే అంశాలు పునరావృతం కానున్నాయి.

ప్రజాప్రతినిధులు హాజరు కావాలి



ఎంపీడీఓ సమావేశం మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ముందస్తు సమాచారం ఇచ్చాం. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరయ్యే సభ్యులు, అధికారుల వివరాలను ఉన్నతాధికారులకు పంపుతాం.

– నర్సింహ, ఎంపీడీఓ, మహేశ్వరం

సమస్యలను సభ దృష్టికి తేవాలి



మండల సర్వసభ్య సమావేశానికి హాజరయ్యే ఎంపీటీసీలు, సర్పంచులు వారి వారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభలో చర్చించి అధికారుల ద్వారా పరిష్కార మార్గాలను ఎంచుకోవాలి. పరిష్కారం కానీ సమస్యలు ఉంటే ఉన్నతాధికారులు, విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి దృష్టికి తీసుకెళతాం. సభ సజావుగా జరిగి, అర్థవంతమైన చర్చ జరిగేందుకు ప్రతి సభ్యులు సహకరించాలి.

– రఘుమారెడ్డి, ఎంపీపీ, మహేశ్వరం

కామ్రేడ్ కుమార్ సేవలు చిరస్మరణీయం


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

బడంగ్‌పేట్: ఎంసీపీఐయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి అమరజీవి కామ్రేడ్ తాండ్ర కుమార్ సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శి బొద్రమోని పురుషోత్తం పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా తాండ్ర కుమార్ ప్రథమ వర్ధంతి సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వాటిని విజయవంతం చేయాలని కోరారు. కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ పార్టీ కార్యాలయంలో సోమవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాండ్ర కుమార్ ప్రజల కోసం చేసిన సేవలు చిరకాలం గుర్తిండి పోతాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో వారోత్సవాలు నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 15న బీఎస్‌రెడ్డి వారోత్సవాలు జరపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ ఝాన్సీ, అఖిత భారత ప్రజాతంత్ర రాష్ట్ర ఉపాధ్యక్షులు బీ సుజాత, ఎం అరుణ, నాగేంద్రమ్మ, జగదాంబ, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి భానుప్రసాద్, బాలాపూర్ మండల కార్యదర్శి జీ కృష్ణ పాల్గొన్నారు.

కొత్త చెరువు పరిశీలన

పనులు చేపట్టరాదని తహసీల్దార్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

మహేశ్వరం: సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. మండలంలోని సిరిగిరిపురం గ్రామ పరిధిలోని కొత్త చెరువు కబ్జాకు గురవుతున్న విషయాన్ని సాక్షి దినపత్రికలో కబ్జా కోరల్లో కొత్త చెరువు..! శీర్షికన వార్త ప్రచురితమైంది. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, వీఆర్ఏలు చెరువును పరిశీలించారు. భూ యజమానులతో మాట్లాడి విచారణ పూర్తయ్యేంత వరకు ఎలాంటి పనులు చేపట్టరాదని ఆదేశించారు. చెరువు ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచి ఉంది, ఎంత విస్తీర్ణంలో ఉంది అనే విషయాలను రెవెన్యూ రికార్డులు, గ్రామ రెవెన్యూ మ్యాప్, ఇరిగేషన్ మ్యాప్, హెచ్‌ఎండీఏ మ్యాపులను పరిశీలించి నివేదిక తయారు చేస్తామని తహసీల్దార్ మహమూద్ అలీ తెలిపారు. చెరువును కబ్జా చేశారని తెలిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతే కాకుండా చెరువు హద్దులను గుర్తించి రక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ స్వర్ణకుమారి, సర్వేయర్ సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చెరువును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కొత్త చెరువును కాపాడాలని వినతి

కబ్జాకు గురైన కొత్త చెరువును రియల్టర్ల నుంచి కాపాడాలని గ్రామస్తులు, బీఆర్ఎస్, సీపీఐ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ సర్వే నెంబర్ 68, 69లో కొత్త చెరువు ఉందని, దీనికి అలుగు కూడా ఉందన్నారు. గతంలో ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసి మరమ్మత్తులు చేసినట్లు తెలిపారు. చెరువును పూర్తిగా సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ మహమూద్ అలీ పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, సీపీఐ నాయకులు దత్తు నాయక్, గ్రామస్తులు బండ నర్సింహ, తడకల శ్రీనివాస్, కన్నయ్య పాల్గొన్నారు.

సంత్ రవిదాస్ గొప్ప సంఘ సంస్కర్త


సంత్ రవిదాస్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నర్సింహ, బీజేపీ నాయకులు

మీర్‌పేట: సమాజాన్ని కలపడం కోసం భక్తి ఉద్యమం చేసిన గొప్ప కవి, సంఘ సంస్కర్త సంత్ రవిదాస్ అని బీజేపీ మీర్‌పేట కార్పొరేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ కొనియాడారు. బీజేపీ కార్పొరేషన్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జేడీ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మీర్‌పేట చౌరస్తాలో రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రవిదాస్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాడు రవిదాస్ ప్రజల మధ్య సామాజిక భేదాలను తొలగించి ఆధ్యాత్మిక, స్వాతంత్రత వైపు ఐక్యతను ప్రోత్సహించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, కోడూరు సోమేశ్వర్, ఎస్సీ మోర్చా నాయకులు చెవ్వ శ్రవణ్‌కుమార్, సూల ప్రభాకర్, పోలే రాజు, తూర్పాటి యాదగిరి, యాదగిరి యాదవ్, నాగరాజు, కిరణ్, దోమలపల్లి కృష్ణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


ఎడ్ల పందాలను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కందుకూరు: మండలంలోని పులిమామిడి చీకటి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఆలయ ధర్మకర్తలు మొకరాల లక్ష్మణ్‌శర్మ, రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో మహా గణపతి, నవగ్రహ, లక్ష్మీసుదర్శన హోమాలు నిర్వహించి పూర్ణాహుతి పూర్తి చేశారు. అనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. సాయంత్రం ఎడ్ల పందాలను నిర్వహించారు. ఈ పోటీలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి ప్రారంభించారు. అంతకుముందు ఆలయంలో నిర్వహించిన హోమంలో బీజేపీ రాష్ట్ర మీడియా కన్వీనర్ బీ సుధాకర్‌శర్మ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అనేగొని అశోక్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు నిమ్మ అంజిరెడ్డి, ఉప సర్పంచ్ వెంకటేష్‌చారి, కే వెంకటేష్ గుప్తా, ఆగిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, దామోదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భార్యపై దాడి.. ఆపై ఆత్మహత్యాయత్నం

పహాడీషరీఫ్: ట్రిబుల్ తలాక్ విషయమై నమోదైన కేసును ఉపసంహరించుకోవాలని భార్యను విచక్షణా రహితంగా కొట్టి ఆపై ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్ రాజీవ్‌గాంధీ నగర్‌కు చెందిన రహీమొద్దీన్ ఖాద్రీ(45), నహీదా ఖాద్రీలు భార్యభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. రహీమొద్దీన్ మరో మహిళతో చనువుగా ఉండడంతో భార్యభర్తల నడుమ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 3న గొడవ పెద్దది కావడంతో రహీమొద్దీన్ భార్యకు ట్రిబుల్ తలాక్ ఇచ్చాడు. ఈ విషయమై నహీదా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు భర్తపై కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న అతను కేసు ఉపసంహరించుకోవాలని భార్యను వేధించసాగాడు. ఆమె వినకపోవడంతో సోమవారం తెల్లవారుజామున భార్య, పిల్లలను తీవ్రంగా కొట్టి అనంతరం కత్తితో గాయపరుచుకున్నాడు. సమాచారం అందుకున్న నైట్ డ్యూటీలో ఉన్న ఎస్సై నయీమొద్దీన్ ఘటనా స్థలానికి చేరుకొని అతన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం రిమాండ్‌కు తరలించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి


నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మీర్‌పేట: విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన పారిశుద్ధ్య కామాటీ సామయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ బాలాపూర్ మండల నాయకుడు దాసరి బాబు కోరారు. మీర్‌పేటకు చెందిన దాసరి సామయ్య మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య విభాగంలో కామాటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. రోజు మాదిరిగా సోమవారం ఉదయం విధుల్లో ఉండగా గుండెనొప్పి వచ్చింది. తోటి సిబ్బంది హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐటీయూ నాయకులు సామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం, అధికారులు ఆదుకోవాలని దాసరి బాబు కోరారు.

ఎర్రకుంట చెరువులో అక్రమ తవ్వకాలు

తలకొండపల్లి: మండలంలోని గట్టుఇప్పలపల్లి ఎర్రకుంట చెరువులో ఒండ్రుమట్టి తవ్వకాలు నిలిపివేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ చెన్నయ్య డిమాండ్ చేశారు. మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మండల తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబర్ 529లో 47ఎకరాల విస్తీర్ణంలో ఎర్రకుంట చెరువు ఉందని.. అట్టి చెరువులో గ్రామానికి చెందిన కొందరు ప్రజాప్రతినిధుల మద్దతుతో కొంతమంది అక్రమంగా తవ్వకాలు జరిపి ఒండ్రుమట్టిని ఇటుకబట్టీల తయారీ కోసం ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో చెరువు చుట్టుపక్కల భూగర్భజలాలు తగ్గడంతో పాటు వ్యవసాయ బోర్లలో నీటిమట్టం తగ్గిపోతోందని ఆరోపించారు.

మోదీ, కేసీఆర్ పాలనలో ధరలకు రెక్కలు

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- బడంగ్‌పేట్‌లో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర


బడంగ్‌పేటలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బడంగ్‌పేట్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం కేసీఆర్ పాలనలో నిత్యవసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆరోపించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో హాథ్ సే హాథ్ జోడో పాదయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిత్యవసర సరుకుల ధరలు పెరగడంతో సామన్య ప్రజలు బతికే అవకాశం లేకుండా పోతోందన్నారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నిర్వహించిన పాదయాత్ర విజయవంతం కావడం హర్షణీయమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా బడంగ్‌పేట ఎస్‌బీఐ వద్ద ధర్నాకు దిగారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత, పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి బంగారు బాబు, బడంగ్‌పేట్ అధ్యక్షుడు పెద్దబావి వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, రాళ్లగూడం సంతోషి, సుదర్శన్‌రెడ్డి, మనోహర్, ఎర్ర జైహింద్, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, అమృత, బాలకృష్ణ, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

బీజేపీ నేత అందెల శ్రీరాములు


వృద్ధురాలితో మాట్లాడుతున్న అందెల శ్రీరాములు

తుక్కుగూడ: అర్హులందరికీ ఆసరా పింఛన్లు అందించాలని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో సోమవారం అందెల పర్యటించి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... చాలామందికి అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు మంజూరు కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిరుద్యోగభృతి, ఉపకార వేతనాల ఊసే లేదన్నారు. బడ్జెట్ కేవలం అంకెల గారడీలా ఉందన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాజకీయ కోణంలో బడ్జెట్ తయారు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కడ్తాల్: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఎంపీటీసీల సంఘం ప్రధాన కార్యదర్శి గోపాల్ అన్నారు. మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.15లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను, రూ.5లక్షలతో నిర్మిస్తున్న గొర్రె కాపరుల భవనాన్ని సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనులకు సంబంధించి పెద్ద ఎత్తున నిధులు విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటేష్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్‌యాదవ్, రైతుబంధు అధ్యక్షుడు బాలకృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు పవన్, మల్లేష్,రవి, మానస, గిరి, అలివేలు, ప్రమీల, లింగం, మల్లయ్య, బీరప్ప, భిక్షపతి, పెంటాజీ, సాయికుమార్ ఉన్నారు.

పేదలకు వరం ‘కంటి వెలుగు’


మహిళకు కళ్ల అద్దాలు పెడుతున్న కార్పొరేటర్ సిద్దాల పద్మ

మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమం పేద, మధ్య తరగతి ప్రజలకు వరమని మీర్‌పేట కార్పొరేషన్ 4వ డివిజన్ కార్పొరేటర్ సిద్దాల పద్మ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ ఫేజ్–2లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కేంద్రాన్ని కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం పేదలకు వరమన్నారు. పరీక్షలు చేసిన వెంటనే అవసరం ఉన్న వారికి కళ్ల అద్దాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం


విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేస్తున్న అనితారెడ్డి

మహేశ్వరం: మండలంలోని నాగారంలో ముస్లిం అనాథ పిల్లలు చదువుకుంటున్న మదర్సాను జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి సోమవారం సందర్శించి ఆర్ట్ ఫౌండేషన్ తరపున విద్యార్థులకు నోటు పుస్తకాలు, రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గొల్లూరు గ్రామంలో గుండెపోటుతో మరణించిన అర్ల దేవేందర్ యాదవ్ కుటుంబాన్ని ఆమె పరామర్శించి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం సహకార సంఘం చైర్మన్ మంచె పాండు యాదవ్, నాగారం సర్పంచ్ బండారి లావణ్య ముదిరాజ్, ఉప సర్పంచ్ లతీఫ్, బీఆర్ఎస్ నాయకులు బండారి లింగం ముదిరాజ్, హబీబ్, ఆనంద్ పాల్గొన్నారు.

ప్రజల్ని చైతన్య పరుస్తాం

కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా చంద్రమోహన్


చంద్రమోహన్‌కు నియామకపత్రం అందజేస్తున్న చల్లా నర్సింహారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా మండలంలోని అమీర్‌పేట్‌కు చెందిన ఎర్ర చంద్రమోహన్ నియమితులయ్యారు. సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేసి చైతన్య పరుస్తామన్నారు. కాంగ్రెస్ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తామన్నారు. నాపై నమ్మకంతో పదవి ఇచ్చిన పీసీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ నవీన్ పీతం, జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి, పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, పారిజాత, జంగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గొల్లూరు రాజు, కార్పొరేటర్ చల్లా బాల్‌రెడ్డి, నాయకులు శశికాంత్, యాదిరెడ్డి పాల్గొన్నారు.